మాట్లాడుతున్న భాస్కరయ్య

సిసి రోడ్ల నిర్మాణంలో కర్నూలు అగ్రస్థానం

- కొణిదల గ్రామానికి రూ.50 లక్షలు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- పూడిచెర్లలో ఫారం పాండ్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సిసి రోడ్ల నిర్మాణంలో కర్నూలు అగ్రస్థానంలో నిలిచిందని ,ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన వేతనాలను రెండు రోజుల్లోగా విడుదల చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఫారం ఫండ్స్ నిర్మాణాల ద్వారా రాయలసీమలో రత్నాలసీమగా మారుస్తామన్నారు.. శనివారం ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 1.55 లక్షల ఫార్మ్ పాండ్స్ పనులను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. రైతు సూర రాజన్న కు చెందిన పొలంలో ఏర్పాటు చేయనున్న ఫారం పాండ్ పనులకు ఆయన భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. పూజా కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం తలకు పాగా చుట్టి, గునపంతో మట్టిని తవ్వి, పారతో మట్టిని తీసి ఫారం పాండ్ పనులకు శ్రీకారం చుట్టారు.. కర్నూల్ జిల్లాలో 8500 ఫార్మ్ పాండ్స్ నిర్మించడం జరుగుతోంది.. అక్కడే ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన ద్వారా ఫారం పాండ్ నిర్మాణ వివరాలను అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం ఇందుకు సంబంధించిన పైలాన్‌ను ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో 98 శాతం రోడ్ల నిర్మాణం పూర్తయ్యిందన్నారు. రైతులు నీరు నిలవ చేసుకోగలిగితే సమస్య ఉండదన్నారు. పగిడ్యాల మండలం కొణిదెల గ్రామాన్ని దత్తత తీసుకుంటానని గతంలో చెప్పానన్నారు. ఆ గ్రామ అవసరాలు తీర్చేందుకు సొంత ట్రస్ట్ నుంచి రూ.50 లక్షల నిధులు కేటాయించి సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.లక్ష 55 వేల ఫారం పాండ్ ల నిర్మాణం చేసే పనులకు డిప్యూటీ సిఎం కర్నూలు జిల్లాలో శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందని తెలిపారు. భూగర్భ జలాలు పెంపుకు ఫారం పాండ్‌లు ఉపయోగపడుతాయనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం రైతుల పొలాల్లో ఫారం పాండ్‌లను ఏర్పాటు చేస్తోందన్నారు. జిల్లాలో ఎన్ఆర్ఈజిఎస్ కింద దాదాపుగా రూ.160 కోట్లతో పనులు చేపట్టామన్నారు. అందులో ఇప్పటికే 97 శాతం పనులు పూర్తి చేశామన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ .. సీసీ రోడ్ల నిర్మాణాలకు పాణ్యం నియోజకవర్గంలో 4 మండలాల్లో రూ.16 కోట్లను మంజూరు చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో కాంపౌండ్ వాల్స్ లేక చాలా ఇబ్బందికి గురవుతున్నారని, ఎన్ఆర్ఇజిఎస్ లో ఈ పనులను కూడా చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు.గ్రామాల్లో స్మశాన వాటికల నిర్మాణాలు కూడా ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు.పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి ఓర్వకల్లు నుండి గుట్టపాడు కొంతలపాడు మీదుగా ఉప్పలపాడు రోడ్డు మంజూరు చేయాల్సిందిగా కోరారు. ఎన్‌హెచ్ 44 నుండి లక్ష్మీపురం నుండి పెద్దపాడు వరకు ఒక రహదారిని ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ఎన్ హెచ్ 44 నుండి రసూల్ పేట మీదుగా వడ్లగండ్ల వరకు ఒక బ్రిడ్జి ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ఉపాధి కూలీల వేతనాలు ఇంకా పెండింగ్ లో ఉన్నాయని, వేతనాలు త్వరితగతిన చెల్లించవలసిందిగా ఎమ్మెల్యే కోరారు. కర్నూలు పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి, నందికొట్కూరు శాసన సభ్యులు గిత్తా జయసూర్య, పంచాయతీరాజ్ గ్రామీణాభివద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనర్ శ్రీకష్ణ తేజ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ పంచాయతీరాజ్ గ్రామీణ అభివద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ నంద్యాల టిడిపి జిల్లా అధ్యక్షుడు , టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, జాయింట్ కలెక్టర్ బి నవ్య ఇతర ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న పవన్ కల్యాణ్

పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

రజకులకు రక్షణ చట్టం అవసరం

- రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- జిల్లా మహాసభలు విజయవంతం
- నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

రజక వృత్తిదారులపై దాడులు, దౌర్జన్యాలను అరికట్టేందుకు ఎస్‌సి, ఎస్‌టి తరహాలో ప్రత్యే రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని డిమాండ్ ఎపి జరకవృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఆరవ జిల్లా మహాసభలను కోడుమూరు నగరంలో తుల్జా భవాని కళ్యాణ మండపంలో నిర్వహించారు. సీనియర్ నాయకులు రాముడు మహాసభల సూచకంగా జెండావివిష్కరణ చేశారు. అనంతరం ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. మహాసభకు జిల్లా అధ్యక్షుడు ముక్కన్న, నాయకులు జయమ్మ, శేషాద్రి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య, వత్తి సంఘాల సీనియర్ నాయకులు జి.రామకృష్ణ, రజక వత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి. గురుశేఖర్, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాజు, రజక ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సి.సిద్ధప్ప మాట్లాడారు. రాష్ట్రంలో రజక రాష్ట్ర కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, కార్పొరేషన్ కు రూ.1000 కోట్లు నిధులు కేటాయించి రజకులకు బీసీ కార్పొరేషన్ ద్వారా సొసైటీలు ఏర్పాటు చేసి రుణాలు ఇవ్వాలన్నారు. ప్రతి గ్రామానికి ఆధునిక దోబీ ఘాట్లు ఏర్పాటు చేయాలని కోరారు. జీవో నెంబర్ 27 ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులు భర్తీ చేసి రజక యువతకు ఉపాధి కల్పించాలన్నారు. రాష్ట్రంలో రజకులపై దాడులు సాంఘిక బహిష్కరణలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టడానికి రజకులకు ఎస్సీ, ఎస్టీ తరహాలో రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కౌసల్య విశ్వకర్మ ద్వారా రజకులకు జిల్లాలో దాదాపు 5వేల మందికి వారం రోజులు పాటు ట్రైనింగ్ ఇచ్చారని, ఆ ట్రైనింగ్లో రోజుకు రూ.500 చొప్పున వారం రోజులపాటు రూ.నాలుగు వేలు అకౌంట్ లో జమ చేస్తామని అన్నారని, ట్రైనింగ్ 5 నెలల అయినప్పటికీ అకౌంట్లో జమ కాలేదన్నారు.

ట్రైనింగ్ పోయిన వారందరికీ రూ.4000 జమ చేయాలన్నారు. రూ.15 వేలకిట్టు అందించాలని, బ్యాంకుల ద్వారా కేంద్ర ప్రభుత్వం రుణం అందిస్తామని చెప్పిందని, రుణాలు అందించాలని వారు కోరారు. భవిష్యత్ పోరాటాలకు జిల్లాలో ఉండే ఉండే రజక వృత్తిదారులు మేధావులు ఉద్యోగస్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభలో వివిధ మండలాల నాయకులు రామన్న, ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, రమణ, కబీర్, నాగరాజు, అంజి, రామలింగప్ప, బడేసా, మద్దిలేటి, ఉరుకుందు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌విఎస్ నూతన కార్యవర్గం

గౌరవ అధ్యక్షులుగా సి.హనుమంతు అధ్యక్షులుగా ముక్కన్న, ప్రధాన కార్యదర్శిగా సి.గురు శేఖర్, ట్రేజరర్ గా సిహెచ్. శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు సి. శేషాద్రి, పర్ల సుంకన్న, శేఖర్ బాబు, సహ కార్యదర్శులుగా జయమ్మ, వీరన్న, బాలు, 43 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నిషేధిత డ్రగ్స్, అత్యాచారాలు అరికట్టాలి

- విద్యార్థి యువజన సంఘాల అవగాహన సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నిషేధిత డ్రగ్స్ అత్యాచారాలను అరికడితే విద్యార్థుల భవిష్యత్తు కాపాడుకోవాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. శనివారం భగత్ సింగ్ రాజగురు, సుఖదేవ్ 94వ వర్ధంతి సందర్భంగా నగరంలో సిల్వర్ జూబ్లీ కళాశాల బాయ్స్ హాస్టల్ లో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అవగాహన సదస్సునిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో త్రీటౌన్ సిఐ శేషయ్య, కళాశాల ప్రిన్సిపల్ వివిఎస్ కుమార్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడా రు. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ వర్ధంతిని పురస్కరించుకొని అన్ని కళాశాల సదస్సులు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఆనాడు భారతదేశాన్ని పాలిస్తున్న బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున విద్యార్థులను, యువకులను స్వాతంత్ర పోరాటంలో దించిన మహనీయులు భగత్‌సింగ్ వారి మిత్ర బృందమని తెలిపారు. ఆనాడు జీవితం మొత్తం ధారపోసి దేశానికి స్వాతంత్రం కోసమే వారి ప్రాణాలను సైతం నవ్వుతూ ఉరికంబాన్ని ముద్దాడి అసువులు భాషారని తెలిపారు. అలాంటి మహనీయులను మననం చేసుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. ఈనాటి సమాజాన్ని పట్టిపీడిస్తున్న నిషేధిత మాదకద్రవ్యాలు, అత్యాచారాలు నిర్మూలించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎవరైనా మాదకద్రవ్యాలు తీసుకుంటే వారి బాడీలో నర్వస్ సిస్టం మొత్తం కంట్రోల్లో లేకుండా మత్తులో మునిగిపోతారని తెలిపారు. మత్తులో ఉండి వారు ఏం చేస్తారో కూడా తెలియని పరిస్థితి ఏర్పడుతుందని, దీనివల్ల వారి ఆరోగ్యం పాడవడం, వారి వల్ల ఇతరులకు కూడా హాని కలుగుతుందని తెలిపారు. హాస్టల్ వార్డెన్ రవి ప్రకాష్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు అబుబాకర్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఖాజా, హరి, బాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

ప్రజా సమస్యలు పట్టవా..?

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, వ్యవసాయ శాఖ, జలవనరుల శాఖ అంశాలపై చర్చించారు. పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ సమావేశానికి వచ్చి మధ్యలోనే వెళ్లారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఎంపీ బస్తిపాటి నాగరాజు, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కూడా సమావేశం మధ్యలో అలా వచ్చి ఇలా వెళ్లారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు కనీసం ప్రజా సమస్యలపై చర్చించి జిల్లా అభివృద్ధికి దోహదపడడం మానేసి ఇలా వెళ్లడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. అధికార పార్టీకి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం అవసరం లేదా..?, ప్రజా సమస్యలు పట్టవా..? కనీసం వినే ఓపిక తీరిక లేకుండా ఉందని పలువురు ఎమ్మెల్యేలు, జడ్‌పిటిసిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడుతూ... మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఎంపీలకు ప్రజా సమస్యలు పట్టవా..?, కనీసం సమయాన్ని ఇవ్వకుంటే ఎలా.. సమస్యలు ఎవరు వినాలి అని ఆగ్రహించారు. వారికి సమయం ఉన్నప్పుడే సమావేశం పెట్టాలని కొత్తపల్లి జడ్‌పిటిసి ఆవేదన వ్యక్తం చేశారు. ఛైర్మన్ పాపిరెడ్డి సముదాయిస్తూ ఇద్దరు జిల్లా కలెక్టర్లు ఉన్నారని, వారికి సమస్యలు విన్నవించాలని తెలిపారు. అసెంబ్లీలో కలెక్టర్లు కాదు.. మాట్లాడేది ఎమ్మెల్యేలు, మంత్రులు.. వారే ఈ సమస్యలు వినకుంటే ఎలా అని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైద్యసేవ ఉద్యోగుల ఆందోళన : గతంలో ఆరోగ్యశ్రీ, ప్రస్తుతం ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్ట్‌లో పని చేస్తున్న ఉద్యోగుల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఎన్‌టిఆర్ వైద్యసేవలో ఉద్యోగులుగా వైద్య మిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్లు, సిసి మానటరింగ్ డిఇఒలు పని చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 96 మంది వైద్య మిత్రలు, ఏడుగురు టీం లీడర్లు, ఒక జిల్లా మేనేజర్ పని చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో 66 మంది వైద్య మిత్రలు, ఆరుగురు టీం లీడర్లు, ఒక జిల్లా మేనేజర్ ఉన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్‌టిఆర్ వైద్యసేవలో అందిస్తున్న వైద్యసేవలు ప్రజలకు అత్యంత కీలకంగా మారాయి. వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో డయాలసిస్, గుండె, ఎముకలకు సంబంధించిన అనేక ఆపరేషన్లు, క్యాన్సర్‌తో పాటు అనేక రోగాలకు వైద్యసేవా ట్రస్ట్ ద్వారానే వైద్యసేవలు జనం పొందుతున్న పరిస్థితి కొనసాగుతోంది. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పేరుతో ఈ పథకం కొనసాగించింది. ఎన్‌టిఆర్ వైద్యసేవ సక్రమంగా అమలు చేయడంలో అందులో పనిచేస్తున్న ఉద్యోగులదే కీలక పాత్ర. అలాంటి ఉద్యోగుల పరిస్థితి మాత్రం అత్యంత ఘోరంగా ఉందని చెప్పవచ్చు. ఎన్‌టిఆర్ వైద్యసేవలో చాలామంది 17 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఉద్యోగులకు ఇచ్చే జీతం మాత్రం రూ.15 వేలు కాగా, కటింగ్‌లు పోను చేతికొచ్చే జీతం రూ.13,080 మాత్రమే. ప్రస్తుతం కూరగాయల నుంచి నిత్యావసర ధరల వరకూ ఆకాశాన్ని తాకుతున్నాయి. స్కూల్ ఫీజులు వంటివి అందనంత ఎత్తులో ఉన్నాయి. అయినప్పటికీ ఎన్‌టిఆర్ వైద్యసేవ ఉద్యోగుల జీతాలు మాత్రం పెరగడం లేదు. దీంతో ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులను కలిసి విన్నవించుకున్నా సమస్యలకు పరిష్కారం దొరకని పరిస్థితి నెలకొంది.

అవీ..ఇవీ..అన్నీ.. : జిల్లావ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. వార్డులు, గ్రామాల్లో సిపిఎం నాయకులు పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. ఇపిఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షన్ నెలకు రూ.తొమ్మిదివేలివ్వాలని, రైల్వేలలో రాయితీలు కల్పించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని కోరుతూ పిఎఫ్ ఆఫీస్ ముందు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు.

తీగలా.. యమపాశాలా..?

ప్రమాదకరంగా 11కెవి విద్యుత్ తీగలు!

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం ఈ తాండ్రపాడు గ్రామంలోని ఇందిరమ్మ కాలనీ ప్రజలు భయం గుప్పిట్లో జీవిస్తున్నారు. వారి ఇళ్ల మీదుగా వెళ్తున్న 11కెవి విద్యుత్ తీగలు ప్రాణాంతకంగా మారాయి. వదులుగా వేలాడుతూ, ఇళ్లకు అతి దగ్గరగా ఉండటంతో అవి నిరంతరం ప్రమాదానికి కారణమవుతున్నాయి.

ఈ సమస్య కొత్తదేమీ కాదు. గత పదేళ్లుగా, స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు, జిల్లా ఉన్నతాధికారులకు తమ గోడును వెళ్లబోసుకుంటూనే ఉన్నారు. కానీ వారి మొరను పట్టించుకున్న నాథుడే లేడు. ఫలితంగా, రెండు మూగజీవాలు విద్యుత్ షాక్‌తో మరణించాయి. షాబీర అనే మహిళ ప్రమాదం నుండి తటిలో తప్పించుకుంది. ఇటీవల, రఫీ అనే సెంట్రింగ్ కార్మికుడు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని, 11కెవి విద్యుత్ తీగలను వేరే చోటుకు మార్చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి, తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఇది సర్వసాధారణమైంది: గ్రామ సర్పంచి ఎస్ బాలపీర

ఈ తాండ్రపాడులో ఇలాంటి ప్రమాదాలు సర్వసాధారణం. ఈ తీగలు ఎప్పుడు, ఎవరి ప్రాణం తీస్తాయోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పిల్లలను బయటకు పంపాలంటేనే భయపడిపోతున్నారు.'ఈ తీగలు మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలి'

మా ప్రాణాలు పోతేనే కదులుతారా?: స్థానికురాలు ఫర్జాన

పిల్లల్ని బయటకు పంపాలంటేనే భయం వేస్తుంది.ఈ తీగలు నిప్పులు చిమ్ముతున్నాయి. జంతువులు, మనుషులు ప్రమాదానికి గురవుతున్నారు. ప్రభుత్వం మమ్మల్ని కాపాడాలి" అని నరసింహ అనే స్థానికుడు కూడా వాపోయాడు.

అంగన్‌వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి -వెల్దుర్తి : అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ బి, పడాయి బి శిక్షణ కార్యక్రమం ఐసిడిఎస్ సిడిపిఒ లూక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం ఈ కార్యక్రమాన్ని పిడి నిర్మల పరిశీలించారు. వెల్దుర్తి 15వ వార్డులో రామళ్లకోట సెక్టార్ అంగన్వాడీలకు హెల్త్ క్లినిక్, వెల్దుర్తి సెక్టార్ అంగన్వాడీలకు రైతుసేవా కేంద్రం సెంటర్లలో ప్రీ స్కూల్, 3-6 సం. లోపు పిల్లలకు శారీరక, మానసిక మేధావికాసం, బావోద్వేగం, కొత్త విద్య పాలనకు అనుగుణంగా తీర్చిదిద్దడం తదితర వాటిపై శిక్షణనిచ్చారు. సూపర్వైజర్లు సరస్వతమ్మ, శ్రీదేవిలు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తేనే రాణిస్తారు

బార్ అసోసియేషన్ వార్షికోత్సవంలో హైకోర్టు న్యాయమూర్తులు

ప్రజాశక్తి-కర్నూలు లీగల్

కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు జస్టిస్ బి.ఎస్ భానుమతి, జస్టిస్ కె.శ్రీనివాస రెడ్డి, జస్టిస్ ఎన్. హరినాథ్, జస్టిస్ ఎ. హరనాథ శర్మలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జస్టిస్ బిఎస్ భానుమతి మాట్లాడుతూ, న్యాయవాదులు అంకితభావంతో పనిచేస్తేనే వృత్తిలో రాణిస్తారని అన్నారు. జస్టిస్ ఎ. హరనాథ శర్మ మాట్లాడుతూ, యువ న్యాయవాదులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవడానికి సీనియర్లను గౌరవించడం, కార్యాలయానికి అందుబాటులో ఉండటం, ప్రతిరోజూ కోర్టుకు హాజరుకావడం వంటి మూడు సూత్రాలను పాటించాలని కోరారు. న్యాయవాదులు సమాజంలో వస్తున్న సాంకేతికతను అలవర్చుకోవాలని సూచించారు. జస్టిస్ ఎన్. హరినాథ్ మాట్లాడుతూ, న్యాయవాదులు తమ క్లయింట్లకు అందుబాటులో ఉండాలని, అప్పుడే వృత్తిలో రాణిస్తారని అన్నారు. న్యాయవ్యవస్థలో ట్రయల్ కోర్టు వాదనలు, తీర్పులను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, వృత్తిలో రాణించాలంటే బాగా శ్రమించాలని, లాబుక్స్ ఎక్కువగా చదవాలని సూచించారు. విజయాలు సాధించడానికి నిరంతర అధ్యయనం అవసరమని తెలిపారు. సీనియర్ న్యాయవాది సి. నాగేంద్రనాథ్ మాట్లాడుతూ, 1873లో స్థాపించబడిన కర్నూలు జిల్లా కోర్టు ఎన్నో సంచలన తీర్పులను వెలువరించిందని, ఈ జిల్లా కోర్టు భవనం ఒకప్పుడు మద్రాసు నుండి విడిపోయిన ఆంధ్ర రాష్ట్ర అసెంబ్లీ భవనంగా ఉండేదని తెలిపారు. ఈ జిల్లా నుండి వచ్చిన అనేకమంది న్యాయవాదులు హైకోర్టు, సుప్రీంకోర్టులలో తమదైన ముద్ర వేశారనిపేర్కొన్నారు. ఎపి బార్ కౌన్సిల్ సభ్యుడు రవిగువేరా మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు బెంచ్ కోసం తాము ఎంతో పోరాడామన్నారు. హైకోర్టు బెంచ్ కర్నూలులో సత్వరం ఏర్పాటు కు సహకరించాలని హై కోర్టు జడ్జీలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా జడ్జి జి కబర్ది, జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శి బిఎస్. రవికాంత్ ప్రసాద్, సీనియర్ అడ్వొకేట్స్ శ్రీనివాస బట్, మురళి మనోహర్ , జోగయ్య శర్మ, శివరామయ్య లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి బి.ఎస్ భానుమతి, వేదికపై న్యాయమూర్తులు

టిబి ముక్త పంచాయతీలే లక్ష్యం

- నియంత్రణకు అనేక చర్యలు చేపట్టాం
- జిల్లా టిబి నియంత్రణ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



టిబి ముక్త పంచాయతిలే లక్ష్యంగా పనిచేస్తున్నామని, టిబి నియంత్రణ కోసం కృషి చేస్తున్నామని జిల్లా టిబి నియంత్రణ అధికారి డాక్టర్ ఎల్ భాస్కర్ అన్నారు. మార్చి 24 జాతీయ టిబి నిర్మూలన దినం సందర్భంగా ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో టెస్టింగ్ కేసుల సంఖ్య పెంచామని టిబి కేసులు తగ్గుముఖం పడుతున్నాయని అన్నారు. 2019 వ సంవత్సరంలో 20,583 టెస్ట్ చేస్తే 3022 టిబి కేసులు నమోదు అయ్యేవని, 2020 లో 1974, 2021లో 2668, 2022లో 2700 కేసులు అయితే ప్రస్తుతం 2024 సంవత్సరంలో 78,368 కేసులు టెస్ట్ చేస్తే 3077 నమోదయాయని తెలిపారు. జిల్లాలో అత్యంత వేగంగా టిబి నిర్ధారించే 2 సిబినాట్ యంత్రాలు -2, ట్రూ నాట్ యంత్రాలు -29 జిల్లా, ఏరియా హాస్పిటల్, సిహెచ్ సి, పిహెచ్‌సిలో ఉండి వీటి ద్వారా వేగంగా టిబి కేసులను గుర్తించవచ్చునని తెలిపారు. వీటితోపాటు సేవా భారతి మొబైల్ ఎక్సరే ఉందని దీని ద్వారా గ్రామాలలో క్యాంపుల సందర్భంగా అక్కడే ఎక్స్ రే తీసి కేసులను నిర్ధారించుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ఎండిఆర్ టీబీ కేసులు 135 ఉన్నాయని, ఒక రోజుకు 11 నెలల వ్యవధిలో సుమారు 18 లక్షలు ఖర్చు అయ్యే మందులను అందిస్తున్నామని తెలిపారు. టిబి రోగి ఉండే ఇంటిలో బిసిజి వ్యాక్సిన్స్ వేస్తున్నారని దాని ద్వారా టిబి ఏ మేరకు తగ్గుతుందో పరిశీలన జరుగుతుందని అందులో భాగంగా నంద్యాల జిల్లాలో వాటిని వేస్తున్నారని, కర్నూలును స్టడీ చేస్తున్నారని తెలిపారు. టిబి రోగులు కోరుకునే వరకు ప్రధానమంత్రి టిబి ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా పౌష్టికాహారం కోసం నెలకు రూ.1000 చొప్పున ఆరు నెలలు అందిస్తున్నామని అన్నారు. దాతల సహకారంతో ఫుట్ బాస్కెట్ ఇస్తున్నామని తెలిపారు. నిక్షేయ మిత్ర ఎవరైనా దాతలు టిబి రోగులకు పౌష్టికాహారం అందించేందుకు ముందుకు రావచ్చునని తెలిపారు. టిబి ముక్త పంచాయతీ లక్ష్యంగా పనిచేస్తున్నామని గ్రామాల్లో 30శాతం టెస్టింగ్ చేస్తే ఒక శాతం కంటే తక్కువగా ఉంటే దాన్ని టిబి ముక్త పంచాయతీగా ప్రకటిస్తున్నామని జిల్లాలో 2023లో -16, 2024 లో - 12 టిబిముక్త్ పంచాయతీలుగా నమోదయాయని అన్నారు. జాతీయ టిబి నిర్మూలన దినం సందర్భంగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని క్విజ్, వ్యాసరచన పోటీలో నిర్వహిస్తున్నామని అవగాహన ర్యాలీ మార్చి 24 వ తారీకు గాంధీ విగ్రహం నుండి మెడికల్ కాలేజ్ మీదుగా జరుగుతుందని తెలిపారు.

డాక్టర్ రామకృష్ణారెడ్డికి నివాళ్లు అర్పిస్తున్న ప్రిన్సిపల్ చిట్టినరసమ్మ , ఇతర వైద్యులు

డాక్టర్ రామకృష్ణారెడ్డి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి సేవలు చిరస్మరణీయమని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కర్నూల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ నరసమ్మ కొనియాడారు. ఇటీవల మరణించిన మాజీ ప్రిన్సిపల్ కార్డియాలజీ విభాగపు అధిపతి డాక్టర్ టి.రామకష్ణారెడ్డి సంతాప సభ ఓల్డ్ సిఎల్‌జిలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కార్డియాలజీ విభాగంలో సేవలు చిరస్మరణీయమని, కార్డియాలజీలో మొదటిసారిగా ఐసియు భాగాన్ని ఏర్పరచారని, అధునాతన చికిత్సలు నిర్వహించారని కొనియాడారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్డియాలజీ విభాగానికి పెద్దలు మాజీ ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి సవలు ఎప్పటికీ మరువలేవన్నారు. వారి ద్వారా ఎంతోమంది వైద్య మేళకువలు నేర్చుకున్నారని అందులో తాను ఒకడి నని గుర్తు చేసుకున్నారు. కార్డియాలజీ విభాగానికి రామకృష్ణారెడ్డి పేరు వల్ల ఎన్నో అధునాతన సౌకర్యాలు కల్పించబడ్డాయని తెలిపారు. కీర్తిశేషులు డాక్టర్ రామకష్ణారెడ్డి కుమారుడు డాక్టర్ విజయకృష్ణ రెడ్డి తనతండ్రి పేరు మీద కార్డియాలజీ విభాగంలో బెస్ట్ అవుట్ గోయింగ్ పిజికి గోల్డ్ మెడల్ అందిస్తామని, ఆ విభాగానికి 30 కాట్స్ అందజేస్తామని తెలిపారు. అనంతరం ఇటీవల మరణించిన వైద్య విద్యార్థిని రమ్య తేజకు సంతాపం ప్రకటించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి సుధీర్, వివిధ విభాగాధిపతులు, డాక్టర్ శ్రీనివాసులు డాక్టర్ లక్ష్మిబాయి, డాక్టర్ .రాధారాణి, డాక్టర్ రాంశివ నాయక్, డాక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ సూపరెండెంట్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ దామమ్ శ్రీనివాసులు, వివిధ విభాగాల ప్రొఫెసర్లు, అసిస్టెంట్లు అసోసియేట్లు డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సి బెళగల్‌లో వడగండ్ల వాన

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ లో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన శనివారం సుమారు గంట సేపు పడింది. పొలాల్లో వర్షపు నీరు నిండుకొని కుంటలలోకి వెళ్లి జలకళగా మారాయి. రోడ్ల మీద గుంతలు నిండుకొని రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. వడగండ్లు పడుతున్న వేళ ప్రజలు రోడ్ల పైకి చేరుకొని వాటిని ఒడిసి పట్టుకొని తాగారు. ఈ మార్చి నెలలో ఎండలు మెండుగా ఉన్నందున భూమి వేడెక్కడంతో ఒక్కసారిగా భారీ వర్షం దాటికి భూమి చల్లబడింది. దీంతో ఈ వర్షం రాక వేసవి దుక్కులకు ప్రయోజన కరమేనని రైతులు, ప్రజలు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

'ప్రయివేట్'కు అప్పగించొద్దు

- ఆటోలతో డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

డ్రైవింగ్ టెస్ట్, వాహనాల ఫిట్‌నెస్ టెస్టులను ప్రయివేట్ సంస్థలకు అప్పగించ రాదని ఆటోడ్రైవర్లు కోరారు. శనివారం ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదోనిలోని టూరిస్ట్ లాడ్జి స్టాండ్ నుంచి ఆర్‌టిఎ కార్యాలయం వరకు మాధవరం రోడ్డు గుండా ఆటోల ప్రదర్శన చేపట్టి, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఆటో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బి.హనుమంతు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.తిప్పన్న, పిఎస్.గోపాల్, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, వీరారెడ్డి మాట్లాడారు. వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్, టెస్టింగ్ చేసే ట్రాక్‌లను ప్రయివేట్ సంస్థలకు అప్పచెప్పడం సమంజసం కాదన్నారు. ఆర్‌టిఎ కార్యాలయాల్లోనే డ్రైవింగ్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తికి వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు శంకర్, గోవిందు, రమేష్, ఈరన్న, చంద్ర, రాము, జార్జ్, నాగరాజు, హనీఫ్, స్వామి ఉన్నారు.

కోసిగిలో సినిమా షూటింగ్

ప్రజాశక్తి - కోసిగి

హీరోయిన్ ఆనందితో దొరల కుటుంబ సభ్యులు

గ్రామంలో 'గరివిడి లక్ష్మి' చిత్ర యూనిట్ సభ్యులు శనివారం సినిమా షూటింగ్ చేశారు. గ్రామంలోని దొరల ఇంట్లో సినిమా షూటింగ్ జరగడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చూడడానికి ఎగబడ్డారు. ఈ ప్రాంతంలో ఎప్పుడూ సినిమా షూటింగ్‌లు జరగకపోవడం, సినిమా షూటింగ్ ఎలా జరుగుతుందో చూడడానికి తండోపతండాలుగా వచ్చారు. 'గరివిడి లక్ష్మి' అనే పేరుతో ఈ చిత్రం బుర్రకథల ఆధారంగా తెరకెక్కుతున్నట్లు సమాచారం. దొరల ఇంట్లో హీరోయిన్ ఆనంది, చిత్రంలో సర్పంచిపై సన్నివేశాలను చిత్రీకరించారు. సాయంత్రం గ్రామ సమీపంలో ఉన్న మొక్కజొన్న తోటలో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. 'గరివిడి లక్ష్మి' సినిమాలో స్థానికంగా కొంతమందిని కొన్ని సన్నివేశాలకు తీసుకున్నారు. రాబోయే రోజుల్లో కోసిగిలో మరిన్ని చిత్రాలు తీయాలని సినిమా యూనిట్ వాళ్లకు గ్రామస్తులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గోనెగండ్లలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - గోనెగండ్ల

చలివేంద్రం ప్రారంభిస్తున్న తహశీల్దార్

గోనెగండ్ల తహశీల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేయించి తహశీల్దార్ కుమారస్వామి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో ఎండల తాపాన్ని చల్లబరుచుకోవడానికి తాగునీరు ఎంతో అవసరమని తెలిపారు. ఎండలో ఎక్కువ సమయం తాగునీరు తాగకుండా ఉంటే శరీరం డిహైడ్రేషన్‌కు గురవుతారని చెప్పారు. రోజూ తహశీల్దార్ కార్యాలయానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పనుల రీత్యా ఎంతో మంది వస్తుంటారని, వాళ్లందరి దాహాన్ని తీర్చడానికి కార్యాలయం ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయించామని తెలిపారు. ప్రజలు, వివిధ కారణాలతో కార్యాలయానికి వచ్చేవారు ఈ చలివేంద్రాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. రీసర్వే డిటి శిరీష, ఆర్ఐ జనార్ధన్ రావు, మండల సర్వేయర్ అబ్దుల్ వాహీద్, విఆర్ఓ రంగముని, టిడిపి నాయకులు ఎన్‌వి.రామాంజనేయులు, శ్రీధర్ నాయుడు, అడ్వకేట్ వెంకటేష్, బాబు నాయుడు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 48 మంది ఎంపిక

ప్రజాశక్తి- ఆలూరు

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఆలూరులో నిర్వహించిన జాబ్ మేళాలో 48 మంది ఎంపికైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.రమాదేవి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎల్.ఆనంద్ రాజ్ కుమార్ తెలిపారు. శనివారం ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. వైఎస్‌కె ఇన్ఫోటెక్ ప్రయివేట్ లిమిటెడ్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, యంగ్ ఇండియా ప్రతినిధులు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. దాదాపు 68 మంది నిరుద్యోగ యువత పాల్గొన్నారు. వీరిలో 44 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. స్కిల్ హబ్ కోఆర్డినేటర్ వీరేష్, ట్రైనర్ మన్సూర్ అలీ పాల్గొన్నారు.

ఎత్తుకు పైఎత్తు..!

- హీటెక్కుతున్న ఆదోని మున్సిపాలిటీ రాజకీయం
- మూడో రోజూ ఛైర్మన్ దీక్ష
- తమను పద్నాం చేయాలన్నదే ఛైర్మన్ కోరిక అంటున్న వైసిపి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపాలిటీలో రాజకీయం వేడెక్కింది. సొంత పార్టీలోనే ఛైర్మన్ పదవి కుంపటి రాజేసింది. ఏ తప్పు చేయకున్నా తనను పదవి నుంచి దింపాలని వైసిపి కౌన్సిలర్లు కుట్ర చేస్తున్నారని, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి.మోహన్ రెడ్డి వంతపాడడం సమంజసం కాదంటూ మున్సిపల్ ఛైర్మన్ ఫైర్ అయ్యారు. నాలుగేళ్లుగా పదవిలో కొనసాగినా ప్రజలకు ఏం చేశారో చెప్పాలంటూ ఛైర్మన్ శాంతపై వైసిపి కౌన్సిలర్లు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మున్సిపల్ ఛైర్మన్ శాంత వ్యవహార శైలిలో మార్పు వచ్చిందని, తమను ఏమాత్రం లెక్క చేయడం లేదని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ సందీప్ రెడ్డి మండిపడ్డారు. కౌన్సిలర్లు ఆఫీసుకు వచ్చే సమయంలో సేద తీరేందుకు ప్రత్యేక గది ఇవ్వాలని కోరినా అనుమతి ఇవ్వకుండా కించపరిచారంటూ వారు నిందిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పడుకోవడం, బర్త్‌డే పార్టీలు చేసుకోవడం ఎక్కడైనా ఉందా అంటూ అందుకే ప్రత్యేకంగా గది ఇవ్వలేదని ఛైర్మన్ శాంత పేర్కొంటున్నారు.

వేడెక్కిన రాజకీయం : ఛైర్మన్ శాంతకు వ్యతిరేకంగా 34 మంది వైసిపి కౌన్సిలర్లు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఆమెను పదవి నుంచి తొలగించాలని అవిశ్వాస తీర్మానానికి అనుమతి ఇవ్వాలని కలెక్టర్ రంజిత్ బాషకు ఈనెల 18న వినతిపత్రం ఇచ్చారు. పదవిని కాపాడుకునేందుకు ఛైర్మన్ శాంత ఆదోనిలోని కోట్ల విగ్రహం వద్ద ఈనెల 20 నుంచి దీక్ష మొదలు

దీక్ష శిబిరంలో ఛైర్మన్ శాంత

పెట్టారు. జగన్ మోహన్ రెడ్డి స్పందించి న్యాయం చేయాలని, ఆయన చెబితే రాజీనామా చేస్తానని ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ దీక్షలో కూర్చున్నారు. ఒక్కో కౌన్సిలర్‌కు రూ.1.50 లక్షలు ఇచ్చారని, వైస్ ఛైర్మన్ నరసింహులు ప్రత్యేకంగా రూ.5 లక్షలు ఇచ్చారని ఆమె బహిరంగంగా విమర్శించారు. ఛైర్మన్‌గా నాలుగేళ్లుగా కొనసాగిన తమరు ఎంత మొత్తంలో ఇచ్చారో ప్రజలకు చెప్పాలంటూ వైసిపి గౌరవాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి సవాలు విసిరారు. అప్పట్లోనే రెండున్నర ఏళ్లకు పదవి దిగాలని, లోకేశ్వరిని ఛైర్మన్‌గా చేద్దామని ఒప్పందం చేసుకున్న విషయం గుర్తు రాలేదా అంటూ ప్రశ్నించారు.

రూ.కోటి ముట్టాయి : ఎన్నికలకు ముందే సిహెచ్.లోకేశ్వరి నుంచి మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి సూచన మేరకు చంద్ర కాంత్ రెడ్డి రూ.కోటి తీసుకున్నారని, ఇది నిజం కాదా అంటూ ఛైర్మన్ శాంత ప్రశ్నించారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తమ పేరును షీల్డ్ కవర్ ద్వారా ఆమోదం చేయడంతో ఏమీ చేయలేక అమౌంట్ తిరిగి ఇచ్చారని, ఈ విషయం మీకు తెలియదా అంటూ నిలదీశారు. డబ్బు వ్యవహారం లేకపోతే సీనియర్ కౌన్సిలర్, బీసీ మహిళ నాగ లక్ష్మమ్మ, కొండారెడ్డి, కీర్తన పేర్లు కూడా ఛైర్మన్‌గా ప్రతిపాదన చేయవచ్చు కదా అంటూ ప్రశ్నించారు. అదే అమౌంటు తాను ఇస్తే మద్దతు ఇచ్చేవారని, లేకపోవడంతోనే అవిశ్వాస ప్రక్రియను తెరమీదకు తెచ్చారని ఆమె వాపోయారు. ఛైర్మన్ శాంత భర్త సింహం నాగేంద్ర బిజెపిలో కొనసాగుతూ ఎమ్మెల్యే పార్థసారథి చెప్పినట్లు నడుచుకుంటూ వైసిపిని తొక్కే ప్రయత్నం చేస్తున్నారని వైసిపి కౌన్సిలర్లు చెబుతున్నారు. పది నెలలుగా ఒక్క వార్డులో అభివృద్ధి పని జరగకుండా ఎమ్మెల్యే సూచన మేరకు ఛైర్మన్ శాంత అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ వైసిపి కండువాతోనే ఛైర్మన్ శాంత దీక్ష చేపడుతూ వైసిపిపై దుష్ప్రచారానికి దిగడం తగదు అంటున్నారు.

మొదలవుతున్న అవిశ్వాస ప్రక్రియ : ఛైర్మన్ శాంతపై అవిశ్వాస ప్రక్రియ వచ్చే వారంలో మొదలు కావచ్చని అధికారులు చెబుతున్నారు. కలెక్టర్ ఫైల్‌పై సంతకం చేయగానే కౌన్సిలర్లకు ఫారం-2 నోటీసు జారీ చేస్తారని, ఈ ప్రక్రియను నడిపేందుకు సబ్ కలెక్టర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించే అవకాశం ఉంది. 42 మంది కౌన్సిలర్లకు గాను ఇటీవల నాగలక్ష్మమ్మ అనే కౌన్సిలర్ చనిపోగా 41 మంది ఉన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌కు ఓటు కలిపి 43 అవుతాయి. ఇందులో టిడిపి ఒకరు, బిజెపి మద్దతు దారులు ఐదుగురు, ఛైర్మన్ శాంత, మినహా 34 మంది వైసిపికి కౌన్సిలర్లు బలం ఉంటుంది. మ్యాజిక్ ఫిగర్ 28 మంది కౌన్సిలర్ల మద్దతు ఉంటే కౌన్సిల్‌లో అవిశ్వాసం సక్సెస్ అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇంత వ్యవహారం నడుస్తున్నా టిడిపి నాయకులు సైలెంట్‌గా ఉండడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇంకా సమయం ఉంది. అంతలో వైసిపికి వ్యతిరేకంగా ఏదైనా జరగవచ్చు అన్న సందేహాలూ ఉన్నాయి.

మాట్లాడుతున్న వైస్ ఛైర్మన్ నరసింహులు

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని గూళ్యం గ్రామంలో గోవర్ధన్ (23) అనే యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. గ్రామానికి చెందిన వన్నూరప్ప, వైస్ ఎంపిపి పకీరమ్మకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు గోవర్ధన్ శనివారం బసవకోడు రోడ్డులో ఉన్న పొలంలో సామగ్రి కిందికి వేయడానికి వెళ్లారు. పక్కనే విద్యుత్ తీగలు కిందికి వెలాడి ఉండడంతో షామియానా, ఇనుప రాడ్లు విద్యుత్ తీగలు తగడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. చికిత్స కోసం బళ్లారి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. గోవర్ధన్‌కు భార్య లక్ష్మి, 8 నెలల కుమారుడు ఉన్నారు. వీరికి పెళ్లి అయ్యి రెండేళ్లయింది. గోవర్ధన్ మృతితో వైస్ ఎంపిపి పకీరమ్మ, వన్నూరప్ప కన్నీరుమున్నీరయ్యారు. రెండో కుమారుడు వికలాంగుడు. అదే గ్రామానికి చెందిన మరో ముగ్గురికి గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ చంద్ర తెలిపారు.

పిడుగు పడి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లకు చెందిన అల్లబండ మాబు వలీ పిడుగుపాటుతో అస్వస్థకు గురయ్యారు. శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. అదే సమయంలో పొలం పనుల నిమిత్తం పొలానికి వెళ్లిన మాబు వలీ సమీపంలో పిడుగు పడడంతో షాక్‌కు గురై స్వల్ప గాయాలతో అస్వస్థతకు గురయ్యారు. గమనించిన సమీపంలోని వ్యవసాయ కూలీలు, గ్రామస్తులు ఆటోలో ఆయనను గ్రామానికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించారు.

కూరగాయల మార్కెట్ వేలం వాయిదా

- కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్ వేలం ఈనెల 25కి వాయిదా వేశామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. శనివారం ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్‌కు వేలం నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. టెండరుదారులు ముగ్గురే రావడం.. అందులో మాన్యువల్ చెక్కులు ఇవ్వడం.. పోటీ లేకపోవడం వల్ల వాయిదా వేశామని కమిషనర్ తెలిపారు. నామమాత్రపు పోటీతో జీవాల సంత పశువుల మార్కెట్‌కు వేలం నిర్వహించారని, ఇది ఎందుకు వాయిదా వేశారని టిడిపి నాయకులు రవి, జయరాం, కాశీ ప్రశ్నించారు. ఆదాయం పెరగాలంటే పోటాపోటీ నిర్వహించాలని, ఎవరి ప్రోద్బలంతో ఇటీవల పశువుల సంత జీవాల సంత కోసం నిర్వహించిన టెండర్లలో ఎందుకు మెతక వైఖరి అవలంభించారని కమిషనర్ నిలదీశారు. అలాంటి దేమీ లేదని, 25న కచ్చితంగా ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్‌కు సుంకం వసూలుకు వేలం నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్విలోని స్త్రీ శక్తి భవనంలో శనివారం గ్రామస్థాయి అధికారులకు, విఏఎలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఖరీఫ్ 2025-26 యాక్షన్ ప్లాన్ తయారీలో భాగంగా ప్రతి రైతూ భవిష్యత్తులో పురుగు మందులు, ఎరువులు లేకుండా పంటలను పండించాలని, విత్తన గుళికలు (డెమోన్‌స్ట్రేషన్) ఎలా తయారు చేసుకోవాలో రైతులకు చేసి చూపించారు. ప్రకృతి వ్యవసాయం డివిజన్ హెడ్ రావన్న, ఏపీవో శివయ్య పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రంపై అవగాహన ఉండాలి

- డిఎల్‌పిఒ నూర్జహాన్

ప్రజాశక్తి - మంత్రాలయం

సంపద తయారీ కేంద్రంపై అవగాహన ఉండాలని డిఎల్‌పిఒ నూర్జహాన్ సూచించారు. శనివారం స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివాస్‌లో భాగంగా స్థానిక సంపద తయారీ కేంద్రం వద్ద ఇఒఆర్‌డి ప్రభావతి ఆధ్వర్యంలో కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. షెడ్డు నిర్వహణ, తడి, పొడి చెత్త సేకరణ, ఇంటింటి చెత్త సేకరణ వంటి విషయాల గురించి వివరించారు. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, కోసిగి ఇఒఆర్‌డి హరూన్ రషీద్, ఎమ్మిగనూరు ఇఒఆర్‌డి విజయలక్ష్మి, పెద్దకడబూరు ఇఒఆర్‌డి జయరాం పాల్గొన్నారు.

జీతాలు చెల్లించి తిరిగి విధుల్లోకి తీసుకోండి

సంపద తయారీ కేంద్రంలో విధుల నుంచి తొలగించిన వారికి జీతాలు చెల్లించి మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని డిఎల్‌పిఒ నూర్జహాన్ ఆదేశించారు. సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగులు పద్మ, చిట్టి, జీవమ్మలు ఆమెను కలిసి తమ గోడు వినిపించారు. చెత్త నుంచి సంపదను సృష్టించే కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగులకు 11 నెలల జీతాలు చెల్లించకుండా 11 మందిని తొలగించారని ఆమెకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె వెంటనే జీతాలు చెల్లించి విధుల్లోకి తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి నాగరాజుకు ఆదేశాలు జారీ చేశారు.

నూర్జహాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

'ప్రతిభ' ఆధ్వర్యంలో ఇఫ్తార్

ప్రజాశక్తి - కౌతాళం

స్థానిక ప్రతిభ హైస్కూల్, మదీనా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. శనివారం స్థానిక జామియా, మదీనా నురాని, అక్స మజీద్‌లలో మగ్రిబ్ నమాజ్ అనంతరం ముస్లింలు ప్రతిభ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాషా, సెక్రటరీ మైనుద్దీన్ మాట్లాడుతూ... రంజాన్ మాసంలో నెలరోజుల పాటు ఉపవాసాలు పాటించి ప్రత్యేక నమాజులు చేయడం రంజాన్ ప్రాముఖ్యత అని తెలిపారు. ఆకలి విలువతో పాటు దైవ జ్ఞానం, దాన ధర్మాల విలువలు తెలిపే మాసమే రంజాన్ అన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

డ్రెయినేజీ, తాగునీటి సమస్యలు పరిష్కరించండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి- ఆలూరు

ఆలూరులో డ్రెయినేజీ, తాగునీటి సమస్యతో పాటు బోరు మరమ్మతుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆలూరులోని వడ్డే కాలనీ, గోవర్ధన టాకీస్ ప్రాంతం, శ్రీరామ టెంపుల్, సిద్దేశ్వర కాలనీలో పర్యటించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు రాధాకృష్ణ, పి.హనుమంతు, కెపి.నారాయణస్వామి మాట్లాడారు. పార్టీలు, పాలకులు మారుతున్నారు తప్ప ఆలూరు ప్రాంతంలో ప్రజా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని తెలిపారు. పాలకులు సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని చెప్పారు. ఆయా కాలనీల్లో పది రోజులకోసారి నీరు వస్తున్నాయని, చెడిపోయిన బోరింగులకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. నెలలు గడుస్తున్నా డ్రెయినేజీ కాలువల్లో పూడిక తీయడం లేదని, దోమలు విపరీతంగా ఉన్నా బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని తెలిపారు. ప్రజలు అనేక విష జ్వరాలతో బాధపడుతున్నా పట్టించుకునే పరిస్థితిలో పంచాయతీ అధికారులు, సర్పంచి లేరని విమర్శించారు. పంచాయతీ అధికారులు, సర్పంచి స్పందించి ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని, లేకపోతే ప్రజలను సమీకరించి పంచాయతీ కార్యాలయాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు మైనా, కృష్ణ, విఠల్, వీరేష్ పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలం హానవాలు గ్రామంలో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు వీరారెడ్డి, రామాంజనేయులు, మండల కమిటీ సభ్యుడు బాష మాట్లాడారు. గ్రామంలో సిసి రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు, కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందని తెలిపారు. నాయకులు రహీం, దస్తగిరి, బాష పాల్గొన్నారు.

ఆలూరులో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ఆదోని మండలంలో పర్యటిస్తున్న నాయకులు

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజి బాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు కోరారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సమావేశం యూనియన్ నాయకులు కె.భీమేష్ చౌదరి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా అంజిబాబు, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.నాగరాజు, సిఐటియు డివిజన్ కార్యదర్శి రాముడు మాట్లాడారు. విద్యుత్ రంగంలో జిఒ 41ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీ, డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎమ్‌డి.అంజిబాబు, కె.భీమేష్ చౌదరి, గౌరవాధ్యక్షులుగా పి.నాగరాజు, ఉపాధ్యక్షులుగా పి.ప్రవీణ్ కుమార్, ఎం.జావీద్, యూనిస్ బాష, హెచ్.రామాంజినితో పాటు 16 మంది సభ్యులను ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా పి.ప్రవీణ్ కుమార్, ఎం.జావీద్, శ్రీనివాసులు, మిన్నప్ప, హనీఫ్, మేశక్, రంగన్న, నాగరాజుతో పాటు 15 మందిని ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గంతో సిఐటియు జిల్లా నాయకులు

ముఖ్యమంత్రి బాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - నందవరం

పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మండలంలోని హాలహర్వి గ్రామం ఎస్సీ కాలనీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి టిడిపి ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు దావీదు, మాజీ సర్పంచి దాసు, టిడిపి నాయకులు మణికుమార్ శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించి అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలపడం సంతోషకరమని తెలిపారు. ఎస్సీ కులాల ఆర్థిక అభివృద్ధికి కోట్లాది రూపాయలతో సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాక విద్యారంగంలో సైతం ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించారని చెప్పారు. రాజకీయాల్లో బాలయోగికి లోకసభ స్పీకర్, ప్రతిభా భారతికి రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ పదవులు కట్టబెట్టి అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టి ప్రత్యేకమైన గౌరవాన్ని కల్పించారని తెలిపారు. ఇదంతా టిడిపితోనే సాధ్యమైందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో తీర్మానం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. 30 ఏళ్ల నుంచి మాదిగ జాతి కోసం పోరాటం చేస్తున్న ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి నాయకులు జి.దుబ్బన్న, ముక్కరన్న, ప్రభాకర్, యర్రన్న, ప్రవీణ్, జాన్, యువరాజు, ఏసేపు, ఏలీషా, ఏసన్న పాల్గొన్నారు.

స్థాయి తెలుసుకొని మాట్లాడాలి

- మాజీ ఎంపిటిసి భాస్కర్ నాయుడు

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు ఎమ్మెల్యేను విమర్శించేటప్పుడు స్థాయిని తెలుసుకొని మాట్లాడాలని మాజీ ఎంపిటిసి భాస్కర్ నాయుడు, మండల కో కన్వీనర్ వీరేష్ తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ ఆవరణలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతున్నా కూటమి ప్రభుత్వం రోడ్లు వేయడంలో విఫలం చెందిందని విమర్శించారు. విరుపాక్షి ఎమ్మెల్యే కాకముందు ఆలూరులో చిరు వ్యాపారులకు ఇచ్చిన మాట మేరకు ఎమ్మెల్యే అయ్యాక ఆలూరులో, పెద్దహోతూరు రోడ్డు గుంతలను పూడ్చి రోడ్డు వేయాలని జడ్‌పి సమావేశంలో మాట్లాడారని తెలిపారు. కలెక్టర్‌కు, ఆర్‌అండ్‌బి అధికారులకు వినతులు ఇచ్చి, ఫోన్లు చేసి వారిపై ఒత్తిడి తెచ్చి రోడ్డు వేయించారని చెప్పారు. 'ఎమ్మెల్యే పోజులు కొట్టడానికి వచ్చార'ని కారుకూతలు కూయడం మానుకోవాలన్నారు. 10 నెలల్లో టిడిపి నాయకులు ఏం ఒరగబెట్టారో చెప్పాలన్నారు. నాయకుల మెప్పు కోసం వార్డు మెంబర్ గా కూడా గెలవలేని వాళ్ళ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. సామాన్య కార్యకర్త నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తి విరుపాక్షి అని, అలాంటి వ్యక్తి పోజులు ఇస్తున్నాడని అనడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని తెలిపారు. మాజీ ఎంపిటిసి నాగేంద్ర, తాలూకా ఐటి వింగ్ అధ్యక్షులు వరుణ్, బాబు, హనుమంతు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భాస్కర్ నాయుడు

శ్మశానం.. అధ్వానం

- పట్టించుకునే నాథులే లేరు..!

ప్రజాశక్తి - నందవరం

నందవరం గ్రామం శ్మశాన వాటిక చెట్లు మొలచి అధ్వానంగా తయారయింది. శ్మశాన వాటికలో చెట్లు మొలచి అధ్వానంగా ఉన్నా దాని గురించి పట్టించుకునే నాథులే లేరని గ్రామ పెద్దలు వాపోతున్నారు. గ్రామంలో అతి పెద్ద జనాభా ఉన్నా శ్మశాన వాటిక మాత్రం నాలుగు ఎకరాలు మాత్రమే ప్రభుత్వం కేటాయించిందని పెద్దలు చెబుతున్నారు. ఒక్కో కులానికి కొంత స్థలాన్ని కేటాయించారు. ఆ ప్రదేశం ఎలా ఉందంటే ఒకరు మరణిస్తే వారిని పూడ్చిటానికి అక్కడ స్థలం లేదు. అంతకుముందు పూడ్చిన వ్యక్తి అవశేషాలు తీసివేసి అందులోనే మరో వ్యక్తిని పూడ్చాల్సిన పరిస్థితి ఉంది. ఉన్న కొద్దిపాటి స్థలం కూడా చెట్లు మొలచి ఉన్నాయి. చెట్లను తొలగించి శ్మశాన వాటికను శుభ్రంగా ఉంచుదామన్న విషయంపై ఎవరూ చొరవ చూపడం లేదని ప్రజలు వాపోతున్నారు. వర్షం కురిస్తే చెట్లు దట్టంగా పెరిగి మృతదేహాన్ని గుంత దగ్గరకు తీసుకెళ్లడానికి కూడా వీలుకాని విధంగా ఉంటుంది. అక్కడ గుంతలు పడి నీరు నిలిచి బురదగా ఉంటుంది. అంత్యక్రియల సమయంలో చాలా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు చెబుతున్నారు. అంత్యక్రియల అనంతరం కాళ్లు కడుక్కోవడానికి కూడా నీటి సౌకర్యం సరిగా లేదు. ఒక్క చేతి పంపు మాత్రమే ఉంది. కొంతమంది వ్యక్తులయితే పక్కన వంకలో నిలిచి ఉన్న కలుషిత నీటితో కాలు కడుక్కుంటున్నారు. సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెట్లతో నిండిపోయిన శ్మశాన వాటిక

శ్రీదేవమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు కోటా వీధిలో వెలసిన శ్రీదేవమ్మ అమ్మ వారిని ఎమ్మెల్యే బి.విరుపాక్షి శనివారం దర్శించుకున్నారు. ఆలూరులో నూతనంగా నిర్మించిన శ్రీదేవమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సమస్యలను తమ దృష్టికి తీసుకరావాలని ప్రజలనుద్దేశించి మాట్లాడారు. వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున, కో కన్వీనర్ వీరేష్, మాజీ ఎంపిటిసిలు రాంగోపాల్, భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రతి నీటి బొట్టూ జీవనానికి అవసరం

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జ్ఞానేశ్వర్

ప్రజాశక్తి - ఆలూరు

సమాజంలో ప్రతి నీటి బొట్టూ ప్రతి జీవి జీవనానికి అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.జ్ఞానేశ్వర్ తెలిపారు. శనివారం కళాశాలలో ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచం నీటి కోసం యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. దేశ సరిహద్దులో ఉన్న మంచు కొండలే మన జీవనానికి మూలమని చెప్పారు. మంచు కొండలు కరిగి పోతే నీటి కొరత ఏర్పడుతుందన్నారు. నీటి ప్రాముఖ్యతను తెలిపేందుకే ప్రపంచ జల దినోత్సవానికి గ్లేసియర్ పరిరక్షణ అని పేరు పెట్టారన్నారు. ఇది నినాదం కాదని, ఇది ప్రపంచానికే హెచ్చరిక అని తెలిపారు. అధ్యాపకులు ఆర్.సుశీల, కె.మాధవి, బి.లక్ష్మీనర్సమ్మ, బి.రాఘవేంద్ర, ఎ.ముద్దప్ప, సిబ్బంది రోషన్, శేఖర్, ప్రణయ్ పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు కృషి : ఎక్సైజ్ సిఐ

ప్రజాశక్తి - ఆదోని

నాటుసారా నిర్మూలనకు బెల్లం వ్యాపారులు సహకరించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ తెలిపారు. శనివారం ఆదోనిలోని ఓ కల్యాణ మండపంలో బెల్లం వ్యాపారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాటుసారా తయారీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'నవోదయ 2.0'ను ముమ్మరం చేసిందన్నారు. నాటు సారా తయారీలో బెల్లం వాడుతున్నారని, బెల్లం కొనుగోలు దారుల ఆధార్ కార్డు సేకరించి ఒకరికి 5 కిలోలు మాత్రమే విక్రయించాలని బెల్లం హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులకు అవగాహన కల్పించారు. నాటుసారా తయారీదారులకు బెల్లం అమ్మకూడదని, అనుమానాస్పదంగా ఎవరైనా పెద్ద మొత్తంలో బెల్లం కొనుగోలు చేస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

పోషణతోపాటు విద్యనందించాలి

- ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు జరీనా, భాగ్యలక్ష్మి, రాజ్యలక్ష్మి

గోనెగండ్లలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

ప్రజాశక్తి - గోనెగండ్ల

అంగన్వాడీ పిల్లలకు పోషణతోపాటు విద్యనందించాలని సూపర్‌వైజర్లు జరీనా, భాగ్యలక్ష్మి, రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు ఎంపిడిఒ కార్యాలయంలో మూడు రోజులపాటు పోషణ్ బీ, పడాయి బీ పేరుతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. వారు మాట్లాడుతూ... అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషణతో పాటు ప్రస్తుతం వస్తున్న మార్పులకనుగుణంగా నాణ్యమైన విద్యనందించాలని తెలిపారు. అంగన్వాడీలు నీరజ, పుష్పావతి, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, కృష్ణకుమారి, జైతున్ బీ పాల్గొన్నారు. **ఆదోనిలో** అంగన్వాడీల శిక్షణ కార్యక్రమం ముగిసిందని ఐసిడిఎస్ సిడిపిఒ ఉమామహేశ్వరి తెలిపారు. పట్టణంలోని ఆర్‌ఆర్ లేబర్ కాలనీ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా అంగన్వాడీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్ శంకర్, సూపర్‌వైజర్లు రాగిని వసంత, భార్గవి, లీలావతి, సావిత్రమ్మ, పుష్పవతి, మహాదేవి, స్వయంప్రభ, సావిత్రి పాల్గొన్నారు.

IN THE COURT OF PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) DHONE
O.S.NO.503/2024
Andhra Pragathi Grameena Bank Repby its Manager, Veldurthi. ....Plaintiff
V/S
గోట్ల విజయభాస్కర్ చనిపోయినందున ఇతని వారసులు
1) గోట్ల శాంత కుమారి భర్త లేట్ జి.విజయభాస్కర్, ఇంటి నెం.1-28, నేసేవీధి, వెల్దుర్తి (గ్రా) & (మం), కర్నూలు జిల్లా. ...ప్రతివాది నెం.1
ప్రతివాది నెం.1
పై దావా బ్యాంకు వారు అప్పు రాబట్టు కొనుటకు గాను విజయభాస్కర్ వారుసురాలుగా మీకు కోర్టు వారు సమన్స్ పంపిన తీసుకొనకి తప్పించుకొనుచున్నారు. కావున 04-04-2025 తేదిన ఉ॥10.30 గంటలకు పై కోర్టు నందు నీవు కాని, నీ తరపున వకీలు గాని హాజరై ఆక్షేపణ ఉన్న యెడల తెలుపుకునేది. లేనంత నీ పరోక్షమందు తీర్మానించ బడును.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా తేది : 04-04-2025
యం.గోపాల్ రెడ్డి,
బి.కాం., బి.ఎల్.,
అడ్వకేట్,
డోన్, నంద్యాల జిల్లా.
సెల్ : 9440557898

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు : కర్నూలు.
ఓ.ఎస్.నెం.6/o2017
జి.నవ మోహన్ రెడ్డి. ...వాది
వర్సెస్
వడ్డె వల్లస్వామి మరియు యితరులు. ...ప్రతివాది
నోటీసు
పై దావాలో వడ్డె రంగస్వామి తండ్రి వడ్డె సుబ్బన్న చనిపోయినందున వారి వారసులైన మీకు నోటీసు
1) కె.సుంకులమ్మ W/o రంగస్వామి
2) కె.సుధాకర్ S/o రంగస్వామి
3) కె.లలిత D/o రంగస్వామి
4) కె.మల్లేశ్వరి D/o రంగస్వామి
చింతలపల్లె గ్రామం, ఓర్వకల్లు మండలం, కర్నూలు జిల్లా.
మీ అందరికి కోర్టు వారు నోటీసులు పంపి ఉన్నారు. పై దావా మీకు నోటీసులు చేరనందున ఈ ప్రకటన ద్వారా తెల్పడమైనది. కావున మీరు కాని మీ తరుపున వకీలు గాని హాజరై ఏమైన అభ్యంతరములు ఉంటే తేది:03-04-2025 ఉదయం గం॥10.30 ని॥లకు హాజరై తెలుపుకొనవచ్చును. లేని యెడల పరోక్షమున కోర్టు వారు తీర్మానించెదరు.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
B.Nagireddy , B.Com. B.L.
Advocate, Kurnool.
Cell : 9440571263